సముద్రంపై లాంచీ ప్రయాణ సంబరం ఎలా ప్రారంభమయి ఎలా ముగుస్తుందో చూడాలి!

"ఎస్ సర్!"

"..............."

"ఎస్సార్ — ఎస్సార్! ఆల్ రైట్ సార్!" అలాగే సర్!" — అని అతి వినయంతో పలికి ఢామ్మని ఫోన్ రిసీవర్‌ను పడేశాడు అసిస్టెంట్ మెరైన్ ఫోర్మన్ సింహాద్రి.

అతడి ఎదుట టేబిల్ కవతల వర్క్‌షాప్ ఫోర్మన్ కూచుని వున్నాడు.

"పన్నెండు మంది •పార్టీ• వస్తున్నారట నాల్గింటికి....లాంచ్ •ఎరేంజి• చేయమని డిప్యూటీ మేనేజరుగారి ఆర్డరు....ఇక్కడ చూస్తేనేమో పదిలో నాల్గు లాంచీలు •బ్రేక్ డౌన్•లో వున్నాయి .... మిగతావి డ్యూటీలో వున్నాయి....అయినా ఇందాక ట్రస్టీ గారి •పార్టీ• ఒకటి వస్తే వాటిలోంచి ఒకటి పంపాను.. అది రావడానికి ఇంకా ముప్పావుగంటయినా పడుతుంది. ఈలోగా ఇంక పావు గంటలో ఇంకో పార్టీ.... ఎక్కడనుంచి తేవాలి లాంచీలను? మాబాధ లెవడికి కావాలండీ....అక్కడనుంచి వరసాగా వియ్యంకుల్ని పంపించినట్లు పంపించేస్తుంటారు—ఇక్కడేమో స్టాఫ్‌ను కాళ్ళట్టుకుని బ్రతిమలాడాలి. ఓవర్‌టయిమయితే మళ్ళీ "హెడ్"గాడు కస్సుమంటాడు. ఎలాగ చచ్చేది...." అని తనగోడు వెళ్ళబోసుకున్నాడు సింహాద్రి.

అవన్నీ ఫోర్మన్ విన్నాడు. కాని అతడు వచ్చింది తన •లోన్• అప్లికేషన్ మీద సింహాద్రి •షూరిటీ• సంతకం కోసం గనుక, అన్నిటికీ తలాడించి, సంతకం చేయించుకుని అక్కడి నుంచి వెళ్ళిపోయాడు.

"భంయ్ — భంయ్" మని మత్తగజం ఘీంకారం. లాటిది వినపడింది.

"ఒరేయ్ పైడితల్లీ! ఆ •సుభద్ర•గాని వచ్చేసిందేమో చూడు...."

నిముషం తర్వాత పైడితల్లి వచ్చి — "అది •సుభద్ర•గాదండీ....•సిరి• అండి.." అని చెప్పేసి చుట్టముక్క వెలిగించే ప్రయత్నంలో పడ్డాడు.

"సుభద్ర ఏవయినట్టు .... ఇల్లిప్పుడు సిఫ్ఫింగుందని వెళ్ళిన సిరి అప్పుడే వచ్చేసిందా .... మరిందాకనగా •డంపింగ్•కెళ్ళిన సుభద్ర ఏమయిందీ .... అని...." అని సింహాద్రి •టగ్•ల గురించి ఆలోచిస్తుండగా .... ఫోన్ మోగింది.

"హల్లో...."

"........"

"ఎవరండి.సీఓటి దొరగారు లేరండీ."

"........"

"డీసీ యాఫీసులో మీటింగ్ కెళ్ళినారండీ."

"........"

"తెల్దండీ....తమ రెవురండీ "

"........"

"అలాగేనండీ."

ఈ లోగా హార్బర్ సైరన్ "కుయ్యో" మని ఆర్తనాదం చేయ్యసాగింది.


"అప్పుడే నాలుగున్నరయి పోయిందేవిటి చెప్మా" అని చేతిమీది "సీకో" వాచిని చూచుకున్నాడు సింహాద్రి. ఇంకా నాలుగే కాలేదు....

"సింహాద్రిగారో.. మన కీ-ఫైర్ బెర్త్ దగ్గర సల్ఫర్ డంపుకి నిప్పంటుకున్నాదండోవ్...." అని పైడితల్లి తాజా వార్త అందించాడు.

అందుకన్నమాట.... సైరనలా అరిచింది.. ఏ ఎదవో అజాగర్తగా బీడీముక్క పడేసివుంటాడంతే....

సింహాద్రి "మెరైన్ ఫోర్మన్ జెట్టీ" మీదకెళ్ళాడు. అక్కడప్పటికే పది పన్నెండు మంది వున్నారు. వాళ్ళందరూ, గంధకం రాజుకోగా లేచిన పొగవేపు చూస్తూ తలో వ్యాఖ్యానమూ చేస్తున్నారు.

మేంగనీసు బెర్త్ ఖాళీగావుంది. క్రొత్త బెర్త్ దగ్గర రష్యాకు గోధుమలు తీసుకెళ్ళడానికని ఒక నౌక అప్పుడే వచ్చింది. ఆ నౌకను హార్బర్ లోపలికి తీసుకురాడానికి వెళ్ళిన రెండు టగ్‌లలో ఒకటి •సిరి•. దాని రాకగురించే ఇందాక పైడితల్లి చెప్పాడు. మరోటగ్ •రాణాప్రతాప్•ని డ్రైడాక్ పక్కన కట్టేశారు కనుక పైడితల్లికి అది కన్పడలెదు. కీ-ఫోర్ బెర్త్‌మీద వున్న నౌక



"స్వీట్ ఫ్లాగ్" అది బొకారో నుండి అమెరికాకు ఉక్కు రేకుల్ని తీసుకెళ్తా వుంది. ఛానల్‌లో తూర్పువైపు ఈ రెండే నౌకలున్నాయి. వీటి కవతలగా వున్న గంధకం కుప్పల దగ్గరే నిప్పంటుకుంది.

తెలుపు, ముదురు పసుపు గోధుమరంగు కలిసి లేచిన ఆ పొగ అనుమానంలా పైకి లేచింది. మనసులాటి ఆకాశాన్ని ఆవరించడానికి యత్నిస్తూంది.

ఉన్నట్లుండి పొగ తగ్గ నారంభించింది.

"ఫైరింజన్లు ఒచ్చేసినట్టున్నా యండీ" అన్నాడు మె. ఫో. జెట్టీమీద నిల్చున్న ప్రేక్షకుల్లో ఒకడు.

"ఔనండీ....రావామరీ....ఇలాటి డేంజర్లుంతాయనే గదండి ఆ బెర్త్‌ల ఎనకాతలే హార్బర్ ఫైర్ స్టేషన్నుంచినారూ" అని ఒక సర్వజ్ఞుడు వ్యాఖ్యానించాడు. "రెండు శాల్తీలూ పోర్ట్‌లో పని చేసేవే."

ఇదంతా విని ఏమీ మాట్లాడకుండా సింహాద్రి వెనక్కు తిరిగాడు. చటుక్కున అతడి కంటికి "కనక మహాలక్ష్మి" కన్పించింది.

దూరంగా, హార్బర్ మూడు పాయలూ కలిసే సంగమం దగ్గర, పడమటి సూర్యుడి కడ్డంగా, షిప్‌యార్డ్ వైపునుండి 'రంయ్' మని అలలను దూసుకుంటూ చలాకీగా వెళ్తున్న "కనక మహాలక్ష్మి" కనపడగానే సింహాద్రికి ఒక ఐడియా వచ్చింది.

చకచక గదిలోకి వెళ్ళి కూచుని. పైడితల్లిని కేకేశాడు. వాడు రాగానే "కనక

# విట్నెస్

వాకాటి పాండురంగారావు



ఆయిల్ బెర్త్‌వైపు వెళ్తోంది. అది తిరగ్గానే ఇటు రమ్మని కేకేయి. ఆ పార్టీ వచ్చేసరికిది రెడీగా వుండాలి" అని ఆదేశించాడు సింహాద్రి.

కాని పైడితల్లికి ఓ సందేహం వుండిపోయింది. "కనకాన్ని ఎక్కడ కట్టెయ్యమన్నారండీ-"

"జెట్టీ పక్కనే కట్టేయమనవోయి."

"జెట్టీకాడ బార్జ్‌న్నాదండి.. దానవతల ఓ ట్రాల రుందండి.... మరి పార్టీ అంతన్నారుగదా.... ఆ ఒచ్చేటోళ్ళు ఇవన్నీ దాటి ఎక్కాలిగదండి—" అని పొజీషన్ విడమరిచి చెప్పాడు పైడితల్లి.

"మరయితే 'భామా' క్రేన్ పక్కన కట్టేయించు—"

"ఎందుకండీ.... ఎస్సెల్ కెనాల్ వైపు కట్టించేస్తే హాయిగా మెట్లుంటాయండి."

"సరి సరె. నువ్వు ముందకు వెళ్ళి అలాంటి వాడికి "సీటి" గొట్టి చెప్పోయ్. లేపోతే వాడెళ్ళిపోగలడు" అని సింహాద్రి గట్టిగా కేకలేశాడు. జారి పోతున్న నీలం చొక్కా చేతుల్ని పైకి మడుచుకుంటూ వెళ్ళిపోతున్న పైడితల్లివైపు చూస్తూ. సింహాద్రి.


"లాంచి రాగానే అందులో రెండు కుషన్లేయించవోయ్!" అని అరిచాడు.

ఆ పన్నెండుమంది పార్టీ నాలుగ్గంటల నలభై నిముషములకు ఒక వాన్ లోంచి మె. ఫో. జెట్టీ వద్ద దిగారు. వారితోబాటు వచ్చిన పోర్టుద్యోగి భద్రాచలం గబగబ ఫోర్మన్ గదిలోకి పరుగెత్తాడు.

ఆ వచ్చినవారిలో ఆరుగురు పురుషులు, అయిదుగురు స్త్రీలు, ఒక చిన్న బ్బాయి వున్నారు. అందరికన్నా పెద్దవాడు కొండలరావు గారు; రిటైర్డ్ డైరెక్టర్ ఆఫ్ పబిక్ ఇన్‌స్ట్రక్షన్. ఆయన భార్యా అలివేలుమంగ; భారీ ఎత్తు శరీరం, దానికి తోడు భారీనగలు. ఆవిడవెంట ఆయా ఎలిజిబెత్ వుంది. మిస్సెలిజబెత్‌కు ముప్పైవెళ్ళ డానికో నెలవుంది.

యూనివర్సిటి లెక్చరర్స్ శేషగిరిరావూ, శకుంతలా ఒకరికొకరు ఏమీకారు. ఆయనకు జూఆలజీ. ఆవిడకు ఇంగ్లీషూ జీతాలు ఇప్పిస్తున్నాయి. శేషగిరిరావు డిపార్టుమెంట్‌లో లెక్చరర్ వెంకటచలం చిన్నప్పుడే పెళ్ళయింది. భార్య నెక్కడికీ బయటకు తీసుకురాడు "ఆవిడదంతా విలేజి మేనర్సండీ" అని పెద్ద జోక్ వేసేసినట్లనుకుని నవ్వుతాడు.

ఆర్టీసీ డివిజనల్ మేనేజర్ గారి తమ్ముడు ఎస్. వి సారధి మద్రాసు రిఫైనరీలో పనిచేస్తున్నాడు. అతడి చెల్లెలు




జానకి కాలేజి స్టూడెంట్. రైల్వే అకౌంట్స్ ఆఫీసర్ సోమయాజీ ఆయన భార్య లక్ష్మి. వాళ్ళబ్బాయి నటరాజు కాక. స్టేట్ బ్యాంక్ ప్రొబేషనరీ ఆఫీసర్ శివరావు ...ఇదీ ఆ బృందం సభ్యుల జాతకాలు వారందరూ ఎవరికి వారుగా వచ్చి పోర్ట్ దగ్గర పరిచయాలు చేసుకున్నారు.

"రండి ప్లీజ్! ఇటు" అంటూ భద్రాచలం దారి చూపగా వాళ్ళందరూ నెమ్మదిగా నడిచి లాంచి "కనక" వున్న వైపుగా నడిచారు.

ఒకరి తర్వాత ఒకరుగా మెట్లు దిగి లాంచి ఎక్కారు అంకరికన్న ముందుగా లాంచి ఎక్కిన వెంకటచలం లాంచి అంచు దగ్గర నిల్చుని అందరికీ చేయి నందిస్తున్నాడు. కొండల్రావుగారా చేయి నందుకుని "థాంక్స్" అంటూ లాంచిలోకి దిగారు. ఆయన భార్య అలవేలుమంగ ధాటికి చలమే నీళ్ళవైపు వాలిపోయినంత పనయింది.

"అమ్మయ్య. మంగా వచ్చావా"అంటూ ప్రేమగా భార్యని పరామర్శించి – తన పక్కన కూర్చో మన్నారు కొండల్రావు.

సారథినీ.... "థాంక్స్" అని లోపలికి గెంతాడు. అన్నయ్య చెయ్యిపట్టుకుని జానకి చేరింది. జానకి సాయంతో లక్ష్మి లోపలికి వచ్చింది. నటరాజ నందుకుని వాళ్ళమ్మ కిచ్చాడు చలం. శకుంతల అతడి చేతి నందుకుంది. చలానికి తన "నిస్వార్థ" సేవ సార్థకమైందనిపించింది. శేషగిరి రావూ. శివరావూ వచ్చారు ఇంక ఎలిజబెత్ వుండిపోయింది.

మెట్ల మీదనుంచి అడుగువేయ డానికి భయపడిపోతోంది. "ఓయమ్మో.... నీళ్ళలోకి పడిపోతాను....నేరాను-" అంటూ పన్నెండేళ్ళ బాలాకుమారిలా వంకరలు తిరుగుతూంది; కాని ఆమె ముప్పైఏళ్ళ శరీరం ఆమె అనుకున్నన్ని వంకరలు తిరగడంలేదు....

"ఫరవాలేదు .... రండి .... నేనున్నాను కదా-," అన్నాడు చలం - "నేనుండగా భయమెందుకు?" అన్న మహాత్ముడి పోజులో -

"వాడు గొప్ప స్ట్రాటజిస్ట్ లాగున్నాడే-" అని అంచనా వేశాడు శివరావు.

"అబ్బ ఎలిజా! త్వరగా రావే! నీభయం చూస్తుంటే మీ అయ్యగారి బి.పి. హెచ్చిపోగలదూ" అని హెచ్చరించింది అలవేల్మంగమ్మ నిజాని కాపాటికే కొండల్రావు గారు కోటు జేబులోంచి ఓ మాత్రతీసినట్లూ వేసుకునే ప్రయత్నంలోనూ వున్నారు.

"రండమ్మా. త్వరగా రండి" అన్నాడు భద్రాచలం. లాంచి నడిపే వాళ్ళల్లో ఇద్దరు వత్తాసు పలకగా. భద్రాచలం ప్రోత్సహించగా. చలం నోటితోను కళ్ళతోను లాలించి. బుజ్జగించి స్వాగతాలు పలకగా 'మైలార్డ్' అంటూ లాంచీలోకి గెంతేసింది ఎలిజబెత్. ఆ 'ఇంపాక్ట్'కి చలం వెళ్ళి కొండల్రావు ఒళ్ళో కూచున్నంత పని చేయబోయేసరికి 'బాగుంది వరసం- అసలే ఆయనకు బి. పి. అంటుంటే ఇంత పెద్ద మనిషి వచ్చి ఒళ్ళో కూచుంటాడేమిటీ' అనుకున్న మంగమ్మ అతణ్ణి తోసింది. ఎలిజా అవ్యాజ పరిష్వంగ సుఖంనుంచి అప్పటిగ్గాని తేరుకోలేదు చలం

సారథి శకుంతలను చూసి నవ్వాడు. జానకి కళ్ళ నవ్వుతోబాటు "మీరూ నవ్వొందోయ్!" అని తన కళ్ళను పురమాయించాడు శివరావు.

శేషగిరి రావు జెట్టీగోడలమీద పేరుకు పోయిన జీవరాసుల్ని చూస్తున్నాడు.

డ్రైవర్ సుందరరావు హెచ్చరికమీద ఇంజన్ స్టార్ట్ చేశాడు కళాసీ. జెట్టీకి కట్టి వున్న తాటిని విడిపించాడు. అప్పలకొండ. లాంచీ బయలుదేరింది.

భద్రాచలం గొంతు సవరించుకున్నాడు. "విశాఖపట్నం ఇన్నర్ హార్బర్‌లో మూడు ఛానెల్స్ లేదా ఆర్మ్స – అంటే పాయలున్నాయి. ఇదిగో ఇది ముఖ్యమైన పాయ. దీనిని నార్తరన్ ఆమ్ అంటారు. ఎగుమతి దిగుమతి ఓడలన్నీ ఇక్కడికే వస్తాయి."

"పాసింజర్ షిప్స్ రావాండీ?" అనడిగాడు సోమయాజులు.

"ఆ ఏనాలుగు నెలల కోసారో అండమాన్స్ నుంచి వస్తుండేది ఆ మధ్య.... ఇప్పుడదీ లేదు–"

"అమ్మో ఆ మద్రాసు వాళ్ళు రానిస్తారుటండీ! వెరీ స్కీమింగ్ ఫెలోస్........ ఇక్కడినుంచి టుబాకో వ్యాపారం కొట్టేశారు. ఇప్పుడేమో అండమాన్స్ నుంచి వైజాగ్ దగ్గరయినప్పటికీ పాసింజర్ షిప్స్‌ను మద్రాసు హార్బర్‌కే తెప్పించుకుంటున్నారు" అన్నాడు సారథి. ఏం చెప్పాలో తెలీక భద్రాచలం వూర్కున్నాడు.

"నో నో.... మనం ఆ దృష్టితో చూడకూడదు. హార్బర్స్ అనేవి నేషనల్ ప్రాపర్టీ.... అన్ని హార్బర్సూ మనందరివీను" అన్నారు కొండల్రావు. ఆయన ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో పని చేసిన వాడు.

భద్రాచలం సాగించాడు: "ఆ మధ్యది రక్షణ శాఖకు చెందినది....అదిగో ఆ పడమటి ఆమ్‌కు. అటువేపు షిప్‌యార్డ్, ఇటు ఆయిల్ బెర్త్. ఫెర్టిలైజర్ బెర్త్ వున్నాయి. అవి రెండూ ప్రత్యేకమయిన బెర్త్‌లు...."

"అవేనాండీ మన షిప్‌యార్డ్‌లో తయారయిన షిప్‌లూ!" అని రెండు యుద్ధ నౌకల్ని చూపిస్తూ అడిగింది మంగమ్మ.

"కావండీ-అవి నేవీ వాళ్ళవి; అదిగో ఆ మూలగా చూడండి. షిప్ యార్డ్‌వారు

తయారుచేసే నౌకలు." అన్నాడు. భద్రాచలం.

"ఒక్కో షిప్ ధర ఎంతుంటుందో" అని శకుంతల వేసిన ప్రశ్నకు సమాధానంచెప్పే మిషతో సారధి అటు చేరాడు.

శేషగిరి కళాసీని ఈ సముద్రంలో దొరికే చేపల రకాల గురించి అడుగుతున్నాడు.

"ఏమండీ సర్దుకున్నారా" అని ఎలిజబెత్‌ను కుశలప్రశ్న వేశాడు చలం.

"బాబుని జాగ్రత్తండీ" అంది లక్ష్మి భర్తతో; సోమయాజులు నటరాజుచుట్టూ వున్న తన చేతిని ఇంకా బిగించాడు.

లాంచి ఇంజన్ రొద చేస్తూంది; నీళ్ళను చీల్చుకుని వెళుతున్న ఆ లాంచిమీది ఒక్కొక్కరూ ఈ నేలను వదిలి నీటి మీదకు వెళ్ళగానే మనసు నావహించే ఒక హాయి. ఒక స్వేచ్ఛ నిండగా తమ తమ పాత వేషాలను అలవాటయిన బురఖాలను వదిలేసి కొత్తగా చూస్తున్నారు; కొత్తగా మాట్లాడుతున్నారు.

లాంచి ఎంట్రన్స్ ఛానెల్ దాటుతోంది. బంగాళాఖాతంలోకి ప్రవేశించబోతుంది.

"అదిగో .... అది వెంకటేశ్వరుడి ఆలయం. దాని వెనకగా అది చర్చి - వందా పాతికేళ్ళ క్రిందకట్టినది .... ఆవయిపున్న దర్గాను ఔరంగజేబు కట్టించాడు - ఇటేమో సాగరగిరి కనకదుర్గ ఆలయం" అంటున్నాడు భద్రాచలం.

"ఔరంగజేబు అంటే ఎవరో తెలుసా?" అని శివరావు జానకి నడిగాడు. 'వాటె సిల్లీ కొశ్చెన్.' అని. ఆమె అనుకునే లోపుగా తనే సమాధానం చెప్పాడు." ఔరంగజేబు అంటే మొఘల్ వంశం పాలిటి సంజయ్ గాంధీ అన్నమాట.

ఫక్కున నవ్వింది జానకి. శివరావు జత కలిపాడు.

"ఊ పక్కకు జరగండి వాళ్ళెవరయినా చూడగలరు" అన్న లక్ష్మి హెచ్చరికకు సమాధానంగా సోమయాజులు జానకీ శివరావులను. శకుంతలా సారధులను చూపించాడు.

"ఈ కెరటాల్ని చూస్తుంటే అవి అలా ఉవ్వెత్తుగా ఎగసి పడడం చూస్తుంటే నాకే మనిపిస్తుందో చెప్పనా" అన్న శకుంతల పెదవుల అందాన్ని మనసులోకి నిల్పుకుంటూ తల వూచాడు సారధి.

Oh! lift me as a wave, a leaf, a cloud!

I fall upon the thorns of life, I bleed. — అన్న షెల్లీ పంక్తులు నా మనసులో పదే పదే ఆడుతున్నాయి—"

"ఔనండీ మనిషి మనసు ఏకాలంలోనయినా పాడే పాట అది.... నా మట్టుకు నాకు ఎడ్మండ్ స్పెన్సర్ రాసిన కవిత చాల మధుర మన్పిస్తుంది...." అంటూ సారధి ఆ ఇంగ్లీషు పంక్తులను తెలుగులో చెప్పాడు.

సాగరతీరాన రాశా నామెపేరు నొక సాయంకాలం
అయితేనేం వచ్చిందొక కెరటం
ఆమె పేరు తుడిచిపోయింది.
మళ్ళీ రాశాను నేను
మళ్ళీ తుడిచింది తను




కేశ సంపదకు

రీటా




స్త్రీలూ పురుషులూ వాడవచ్చును

సూపర్ ఎకానమి (100 ml) సైజులో కూడా వస్తున్నది

# ఆనందమార్గం

దొడ్డి తవ్వి మొక్కలు నాటడానికి ఏర్పాటు చేసిన కూలివాడు మాటిమాటికీ బూతులు మాట్లాడటం చూసి ఇంటావిడ :

"ఈ భాష ఎక్కడ నేర్చుకున్నావురా" అని అడిగింది.

"నేర్చుకుంటే వస్తుందా, అమ్మగారూ; పుట్టుకతో రావాలిగాని!" అని వాడు గర్వంగా సమాధానం చెప్పాడు.

★

రాజకీయవాది : పారిశ్రామికవేత్తలమీద పన్నులు జోరుగా వెయ్యాలి. లేకపోతే వాళ్ళు మనకంటే ధనవంతులై పోరూ?

★

జోసెస్ ఎర్నెస్టు రేనాన్ అనే ఆయన ఇలా ప్రార్థించాడు. ఓ భగవంతుడా! (అసలా పేరుగల ఆసామీ ఒకడుంటే) నా ఆత్మను (ఆత్మ అంటూ ఒకటుంటే) కాపాడు!"

★

సీత : ప్రాణేశ్వరా నాకా లేడి కావాలి.

రాముడు : చంపావు! అది బంగారపుది. దాన్ని తీసుకువస్తే నన్ను ప్రభుత్వం స్వర్ణ నియంత్రణ చట్టం క్రింద అరెస్టు చేస్తుంది.

★

రెండవ ప్రపంచ యుద్ధ కాలంలో ఇంగ్లండులో ఉన్న ఒక అమెరికన్ సోల్జరు ఒక బ్రిటిష్ కోటలో వడ్డించిన భోజనం చూసి అసహ్యించుకొని, పళ్ళెం విసురుగా పక్కకి త్రోసివేశాడు. వంటవాడు కోపంతో "ఆహారం అలా వృధాచేస్తే ఎలా? ఆహారమే మనకు యుద్ధంలో విజయాన్ని తెస్తుందని నీకు తెలియదూ?" అని అడిగాడు.

అమెరికన్ సోల్జరు : తెలుసు; కాని ఈ ఆహారాన్ని జర్మనీ వాళ్ళు తినేటట్లు చెయ్యటం ఎలాగో కాస్త చెప్పు చూద్దాం;

★

బజారులో ఒక కొత్తరకం "వేనిషింగ్ క్రీమ్" అమ్మకానికి వచ్చింది. ఆ క్రీము పూసుకుంటే చెమటకంపు పోదుగాని, రాసుకున్న మనిషి మాయమై కంపు ఎక్కడి నుంచి వస్తోందో తెలియకుండా పోతుంది.

★

ఉపాధ్యాయుడు : ఎద్దు చర్మం వల్ల ఒక ఉపయోగం చెప్పు :

ఒక విద్యార్థి రెండు నిమిషాలు ఆలోచించి: "ఎద్దు శరీరంలోని ఎముకలు, ప్రేగులు వగైరా నేలమీద పడిపోకుండా సంచిలా ఉపయోగపడుతుంది.

—జె. రాఘవేంద్రరావు, గుడివాడ

**నన్నుచూచి నవ్వింది కెరటం—**
పిచ్చివాడా ఓ మనిషీ!
ఎందుకీ వృధా ప్రయత్నం—
క్షణికమయిన దాని కివ్వగలవా
చిరంజీవత్వం—?

అంటూ నవ్వింది: నవ్వి వెళ్ళింది—" శకుంతల తన మనసులో సారధికి పెద్ద పీట వేసింది; తను పనిచేసే యూనివర్శిటీలో అందులోనూ భాషలపేరిట, సాహిత్యాల పేరిట చెమటోడుస్తున్న వారికెవరికీ ఈ 'వాసన' లేదే అని విస్తుపోయింది. ఇతడు వాటిని తరగతిలో వల్లించడంకాదు; మనసులో నిల్పుకున్నాడు - కవిత నిలిచే మనసంటే వెన్నెల తెలిసిన రాత్రన్నమాట! ఎంతందమయిన రాత్రి అది!

ఆ తన్మయత్వంలో వారుండగానే సోమయాజులు వాళ్ళ వైపు చూపించాడు.

"మంగా.. మనం పెళ్ళయిన కొత్తలో రాజమండ్రి నుంచి బొబ్బర్లంక లాంచీలో వెళ్ళాం గుర్తుందా?" అన్న రిటైర్డ్ డి. పి. గారి ఫ్లాష్ బాక్ అలివేలు మంగమ్మని మూడున్నర దశాబ్దాలు వెనక్కు తీసుకెళ్ళింది. ఆ క్షణం వచ్చి ఈ క్షణంలో నిలవగా ఆ కొత్త పెళ్ళికూతురు మనసు కిలకిల మంది. ఆమె చెక్కిళ్ళ ఎరుపుదనం ఆ చూపుల బరువు తప్ప ఇంకేమీ కనపడని కొండలరావుగారామె చేతిని తన చేతిలోకి తీసుకున్నాడు.

యధాలాపంగా తీసుకున్నట్లుగా ఎలిజబెత్ చేతిని తన చేతిలోకి తీసుకుంటూ చలం "అదిగో అక్కడే వుంది లైటౌసు" అని చూపిస్తున్నాడు.

భద్రాచలం ఉవాచ : "ఇది ఇండియాలో కెల్లా లోతయిన హార్బరు. ఈ ఔటర్ హార్బర్ కట్టడానికి వందకోట్ల రూపాయలయింది-"

"అమ్మో" అన్నాడు అకౌంట్సాఫీసర్ సోమయాజులు .... అకౌంట్లన్నీ ఆడిటయి వుండా లీపాటికి అనికూడా అనుకున్నాడు.

"అదిగో అది ఓర్ బెర్త్ అక్కడ లక్ష టన్నుల ఓడలువచ్చి నిలుస్తాయి. ఇవిగో ఈ సముద్రం మధ్యగా కట్టినవాటిని "బ్రేక్ వాటర్స్" అంటారు. ఈ అడ్డుగోడల ధర్మమా అని అలలన్నీ అణగిపోగా ఇక్కడ ఇంచుమించు నిశ్చలంగా వుంటుంది."

"సార్!" అన్నాడు కళాసీ. భద్రాచలం అటు తిరిగాడు...."బ్రేక్‌వాటర్స్ దాటి వెళ్ళమంటారా?" అని డ్రైవర్ సుందరరావ్ అడుగుతుండడం కన్పించింది. సభ్యుల వైపు చూచాడు భద్రాచలం. జానకి, చలం, సోమయాజులు, కొండలరావు-ఒక్క

# సైగల్

ఒక పాట నన్ను పగబట్టింది
మాటేసి నా ఒంటిని చుట్టుకుంది.

ఏ తుఫాను రాత్రి
లాంతరు పట్టుకుని సముద్రాన్ని
సముదాయించడాని కెళ్ళినపుడో

గాలి చేతుల వూపుకి రాలిపోతున్న
చెట్లజుట్టు దువ్వడానికెళ్ళినపుడో
పిల్లకాలవ ఒంటిమీద ఓణీని
సంజేయడానికెళ్ళినపుడో

మొగిలి డొంకల్లో వెన్నెల పారేసుకున్న
వయసు వేసవిని వెతకడానికెళ్ళినపుడో
ఎప్పుడు నా కాలు దీనిమీదపడిందో!
ఒక పాట నన్ను పగబట్టింది.

నా కలలు తనే కంటుంది
నా కలలు తనే తింటుంది
నా గొంతులో దాని విషాద గరళం
దాచుకుంటుంది
నా కళ్ళలో దాని కుబుసం విడుస్తుంది
నా వెన్నులో జరజరా పాకుతుంది

చందమామ చిట్లి
సొనకారుతున్నప్పుడో
నల్లని ఆకాశం జుట్టు
భూమిని కప్పేసి నక్షత్రాల వేళ్ళతో
దగ్గరికి లాక్కున్నప్పుడో
ఎప్పుడు దానినేం చేశానో!

ఒక్కసారిగా ప్రాణం తీసినా బావుణ్ణు
విసవిసా పాకుతూ వొచ్చి
ఒంటికి కసిగా చుట్టేసుకుని
నా వూపిరి కొసలచుట్టూ బుసలుకొడుతుంది.
నన్ను వెంటాడడం మానదు
నన్ను నా మానాన బతకనివ్వదు.

——నగ్నముని


---

సారిగా "పోదాం-పోదాం-" అన్నారు. భద్రాచలం సిగ్నల్ ఇచ్చాడు.

లాంచ్ ముందుకు దూసుకు వెళ్ళసాగింది; తమకు అందికూడా అందనట్లు వెళ్ళిపోతున్న లాంచ్ నిర్లక్ష్యంచూచి లాంచ్ వెనకున్న అలలు కోపంతో వెక్కిరిస్తున్నాయి.

"ఇదిగో ఎడమవైపున్నది తూర్పు బ్రేక్ వాటర్.... దీని పొడవు ఒక మైలుంటుంది. అడుగున సముద్రగర్భం మీద దీని పునాది వెడల్పు నూటపది మీటర్లుంటుంది"

భద్రాచలం మాట కడ్డొస్తూ లక్ష్మి అడిగింది "ఏమండీ ఆ దూరంగా కన్పిస్తున్నది చెప్పేసారండీ!"




ఫిబ్రవరి 25 వ తేదీన రాష్ట్ర శాసనసభకు జరిగే ఎన్నికలకు జనవరి 31 వ తేదీ నాటికి మొత్తం 1019 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. అధికార కాంగ్రెసు నుంచి 226. ఇండిపెంటెన్స్ 313. ఇందిరా కాంగ్రెసు 174. జనతా 164. కమ్యూనిస్టు పార్టీ 18. మార్క్సిస్టు పార్టీ 10. ఆర్. పి. ఐ. 7. డి. ఎమ్. కె. 4. ఎ. ఐ. డి. ఎం. కె. ముగ్గురు నామినేషన్లు దాఖలు చేశారు.

"అవునండి అది •కాంచన గంగ• అన్న ఆయిల్ టాంకర్. దాని బరువు రెండు లక్షల అరవై వేల టన్నులు!"

"మరది హార్బర్ లోకి రాలేదేం?" అని అడిగాడు సోమయాజులు.

"అది లోపలికిరాగల హార్బర్ మన దేశంలోనే లేదు. అంచేత అది సముద్రం మధ్యనే లంగరేసి నిలుస్తుంది. దాని నుంచి క్రూడ్ చమురును చిన్న నౌకల్లోకి తోడుతారు. ఆ చిన్న నౌక ఇన్నర్ హార్బర్ లోకి వెళ్ళి రిఫైనరీకి సరఫరా చేస్తుంది....

చాల నెమ్మదిగా లాంచి ఉయ్యాలవలె ఊగసాగింది. ముసి ముసి నవ్వులు నవ్వుకున్నారందరూ. మనసులలో ఏవేవో ఊహలు రెక్కలు తొడుక్కుంటున్నాయి. వారి ఎదలలో ఎడ్మండ్ హిలరీ. మిహిర్ సేన్ ల అంశలు లీలామాత్రంగా కదలాడాయి. తామొక గొప్ప ఎడ్వంచర్ చేస్తున్నామనుకుంటూ. థ్రిల్ అనే విందు భోజనానికి సన్నద్ధులు అవసాగారు.

"ఇదిగో కుడివైపున్న దక్షిణపు బ్రేక్ వాటర్ ను ఇంకొక నిముషంలో దాటుతాము. అప్పుడు మీకు దాని కవతల పరిస్థితికీ, ఇవతల పరిస్థితికి తేడా తెలుస్తుంది" అని సగర్వంగా ప్రకటించాడు భద్రాచలం.

"ఏమండీ మీకు ఫరవాలేదా...." అని ఆందోళనతో అడిగింది మంగమ్మ.

"ఓ ఎస్. నాకేం ఫరవాలేదు. నువ్వు గట్టిగా పట్టుకో పడి పోగలవు" అని కొండల్రావు అంటుండగానే నాల్గడుగుల కెరటం మీదకు ఎగిసి తేలింది లాంచి.

మరుక్షణం ఝుంయ్‌మని. జెయింట్ వీల్ లోని ఉయ్యాల పీటలా క్రిందకు. అలల ఒడిలోకి దూకింది.

ఆ దూకిన క్షణం "కెవ్" మని అరిచారు నలుగురు.

"జాగ్రత్తగా పట్టుకోండమ్మా" అని హెచ్చరించాడు కళాసీ.

లాంచ్ ముందు వైపుగా నిల్చున్నలక్ష్మి. జానకి. శివరావు. శేషగిరిరావు. సారధుల మొహాలమీద అలలతుంపర ఝల్లుమని వచ్చి పడింది. ఒక్క క్షణం అదిరిపడి మరో క్షణం తెప్పరిల్లి ఒకరి నొకరు చూచుకొని నవ్వుకున్నారు.

మళ్ళీ పైకి లేచింది లాంచ్; హఠాత్తుగా ఎవరో జారవిడిచినట్లుగా క్రిందకు దూకింది.

అదొక సయ్యాట; లాంచ్ కీ సముద్రానికీ మధ్య సరసం. సముద్రానికి అరచేయి అల; లాంచ్ లాంచంతా ఒక అరచేయి. ఆరెంటి మధ్యా-

"చెమ్మచెక్క - చేరడేసిమొగ్గ"!!

ఒక్కక్షణం. అదిగో ఆ కెరటం. అంత ఎత్తున. వస్తూందే. లాంచ్ మీదకు పడి దాన్ని ముంచేస్తుందేమో నన్న పెనుభయం. మరుక్షణం అంత కెరటమూ క్రిందా. పైన లాంచీగా కాగానే ఒక పెద్ద రిలీఫ్! ఆ భయానికీ, ఈ రిలీఫ్ కూ మధ్య ఎక్కడో క్షణంలో పదోవంతు థ్రిల్. చెప్పలేని హాయి.

ఆ రెండింటి మధ్యా అది సంఘర్షణా? సంఘర్షణ చివర రాజీయా?....లేక అది అన్యోన్య దాంపత్యమా. దాని మధ్య ప్రణయ కలహమా....?

ఏదయితేనేమి. ఆ ఉయ్యాల తొట్టిలో అందరూ అనసూయ ఇంటిలో త్రిమూర్తులవలె పాపాయిలే.

తడిశారు; వణికారు; క్రింద పడ్డారు; లేచారు;

"ఆ అలల నురుగులమీద బంగారం మలాము చూశారా .... ఏ ఆర్టిస్టూ సాధించలేని ఆ హార్మనీ ఆఫ్ కలర్స్...." అన్నాడు సారధి .... మరుక్షణం తూలి పడబోయిన శకుంతలను పొదివి పట్టుకున్నాడు.

.... చివర బెంచీమీద కూర్చునివున్న కొండల్రావు దంపతుల ప్రక్కన చేరిన శేషగిరిరావు- "ఈ ప్రాంతం రొయ్యలకు చాల ప్రసిద్ధం అండీ.. అవిగాక •ట్యూనా• అని ఒక రకంచేప వుంది.... అవంటే అమెరికన్లు పడిచచ్చిపోతారండీ....? అని వివరిస్తున్నాడు. "హరిహరీ!" అని చెవులు మూసుకుంది మంగమ్మ: అవాళ శనివారం. ఆవిడ ఖచ్చితమైన శాకాహారి!

"బాగుంది కదూ" అని తెలుగు సినిమా కవిలా పలుకుతున్న వెంకటచలం డైలాగుకు తల వూపుతున్నది ఎలిజబెత్. హఠాత్తుగా వాళ్ళు రెండు వీపులున్న వింత జంతువు అయ్యారు; మరుక్షణం అలను దాటి లేచింది లాంచీ.

"ఇంకా ముందుకు పోదాం. అదిగో ఆ షిప్ దగ్గరకు" అంది జానకి. నీటి బిందువులతో తడిసిన ఆమె మొహం, చెదరిన ఆ ముంగురులు, మొహంలో ఆ ఉత్సాహం చూసిన శివరావు మనసు పాలకడలి అయింది.

"అమ్మో. వద్దండీ. వెనక్కు పోదామండీ." అన్నారు. లక్ష్మి. మంగమ్మ.

పెద్ద అల-చాలా పెద్దఅలవచ్చి మోదింది. ఫెళ్ళున నీరు వర్షించింది లాంచ్ లోని అందరూ తడిశారు .... మూడేళ్ళ నటరాజయితే కేరింతలు కొడుతున్నాడు

హఠాత్తుగా నిశ్శబ్దం....

డ్రైవర్ సుందరరావ్ ముఖంలో

తొట్రుపాటు...."అప్పలకొండా...." అని పిలిచాడు.

"ఏమయింధండీ-" అని దీనంగా అడిగింది ఎలిజబెత్.... ఆ ప్రశ్ననే అందరూ మౌనంగా వేశారు....

"అబ్బే.. ఏమీ లేదండీ.. ఎవరూ ఏమీ గాభరా పడకండి...." అంటున్నాడు గాని భద్రాచలానికి ఉన్నట్లుండి ఇంజన్ ఆగిపోవడం తెలుసు....

లేచిందింకో కెరటం.... ఈ సారది మిత్రుడిలా లేదు, శత్రువులా వుండి. తెల్లటి నురగ కోరలతో ఉరికివస్తున్న నల్లటి నీళ్ళ రాక్షసుడులా వుంది..

"ఏమండీ" అని కేకపెట్టి మంగమ్మ కొండ్రాలావుగారిమీద వాలిపోయింది. ఆమె పరిస్థితి చూచి ఆయన తన కోటులోంచి మాత్రతీయబోతూ కళ్ళు మూయడం గమనించిన శేషగిరిరావు ఆయన గుండె మీద రుద్దసాగాడు.

"అయ్యో! మా అయ్య....అవ్వ...." అని ఎలిజబెత్ ఏడవసాగింది .... "ఏడవకెలిజా...." అని ఆమె వీపు నిమురుతూ సముదాయిస్తున్నాడు వెంకటచలం.

"ఏమండీ .... మనతోబాటు ఈ లాంచ్ ఇలా "సింక్" అయిపోతే రేపొద్దున పత్రికల్లో మొదటి పేజీలో....మనమేకదూ...." అని నవ్వుతూ జానకి వేసిన జోక్‌కు శివరావు అదిరిపోయాడు.

బ్యాంక్‌లోచేరి ఏడాదవవస్తూంది; పోయిన వారమే పెళ్ళి చూపులయ్యాయి. సంబంధం కుదిరింది. అయినా తనింతసేపూ జానకితో కులికిన పాపానికి అందరూ మునిగిపోవాలా. భయం భయం. చావు భయం.

"భయం ఎందుకు? చావా.... అంటే ఏమిటి? ఆ అనుభవం ఎలా వుంటుంది? అన్నట్లు చూస్తున్న శకుంతల చేతిమీద తన చేతి నుంచాడు సారధి.

"వెంకట్రమణస్వామీ! నాయినా! కాపాడు తండ్రీ.. నేను మా వారూ మా బాబూ సురక్షితంగా ఒడ్డు చేరితే నీ కొండ కొస్తాం నాయనా.. శనివారం రెండు పూటలూ వుపవాసం వుంటామురా తండ్రీ–" అని దుఃఖమూ భక్తీ – బురదా, నీరూలా కలిసి లక్ష్మి నుంచి ప్రవహిస్తుంటే వింటున్నాడు మొనడు మొద్దుబారి పోయిన సోమయాజులు.

—పైకి లేచింది లాంచ్.... ఒక పక్కకు వాలినట్లయింది.

"అయ్యో....!" ఎంత భయంకరమైన ప్రకృతి!

ప్రళయ పయోనిధిలా!.. ప్రాణదాహం! ఉప్పటి నీటివర్షం.... భయపుచలి ....

భయం అనే నిప్పురవ్వల తుంపర....జగ్! జగ్ జగ్!

ఆ నిముషన్నరసేపు ఇంజన్‌రూంలో వున్న భద్రాచలం, అప్పలకొండ బైటకి వచ్చారు.

జగ్‌జగ్! జగ్ జగ్!

ఇంజన్ రొద - ఆ శూన్యంలో కోకిల గానంలా వినవచ్చింది.

రెండు నిముషాలసేపు నిర్జీవంగా, చెక్కపెట్టెలా వున్న ఆ లాంచీ ఇప్పుడు మళ్ళీ వెచ్చని తల్లి ఒడిలా కదిలింది.

"ఇంజన్‌లో ఏదో "చోక్" అయిందండీ. మరేమీ లేదు.. నే నిందాకే చెప్పాను కదా.." అని భద్రాచలం వెనక్కు తిరగమన్నాడు లాంచ్‌ని.

లాంచి రేవు వైపు తిరిగింది.

....బంగారం అంతా పంచేసిన సూరీడు కాషాయాంబరాలు ధరించి పడమట సన్యసిస్తున్నాడు.

సముద్రం నీలాన్ని వదలి నలుపును ధరిస్తూంది. మనిషి అజ్ఞానమంతటి చీకటి: జ్ఞాన గుళికల్లా విద్యుద్దీపాలు.

"ఏమండీ. ఏమయిందండీ" అని మంగమ్మ అడుగుతూ లేచిన క్షణాన్నే కొండ్రాలావు కళ్ళు తెరిచి "మంగా....బాగున్నావు కదా" అన్నారు.

"అమ్మయ్య! మీకే మయిందోనని భయపడి పోయానండీ." అని ఎలిజబెత్ కొండ మీద కన్పిస్తున్న చర్చివైపు చూచి కళ్ళు మూసుకుంది. ప్రార్థన అయ్యాక వాళ్ళమ్మగారి చేయి నిమురుతూ ఆమె ప్రక్కనే కూర్చుండిపోయింది.

"ఇంకెప్పుడూ .... నీకు తప్ప నామనసులో ఎవరికీ చోటివ్వను -" అని శివరావు కాబోయే భార్యకు ప్రామిస్ చేశాడు మనసులోనే.

"అయినా లక్ష్మీ! నీకు భయంవేస్తే వళ్ళు తెలియదు. మొన్న తిరుపతికెళ్ళొచ్చి ఇంకా రెండు నెలలయినా కాలేదుకదా .... మళ్ళీ ఏం పెట్టుకు వెళ్దామనీ –" అని గునుస్తున్నాడు సోమయాజులు.

"పోయింది మీ పత్రికల్లో పడే ఛాన్స్!" అని నవ్వాడు.... సారథి. "ఎక్కడకు పోతుందండీ.. జీవితం సుదీర్ఘం –" అని సాగదీసి పలికింది శకుంతల. ఇద్దరూ నవ్వారు.

"మిస్టర్ చలం; ఆ.. సీగల్స్ రెక్కలున్నాయి చూశారూ...." అని శేషగిరిరావ్ చెబుతూంటే చచ్చినట్లు వింటున్నాడు వెంకటాచలం.

భద్రాచలం వాచి చూచుకున్నాడు. ఆరవుతూంది; నవంబరవడం మూలాన్ని బాగా చీకటయింది. "ఆ వెధవబస్సు ఎప్పుడు దొరుకుతుందో. ఇల్లెప్పుడు చేరుతానో–" అనుకున్నాడు.

అప్పలకొండ చుట్ట వెల్గించి చతికిల పడ్డాడు.

"కనక మహాలక్ష్మి" ఝుంయ్‌మని వెళ్తూంది.

ఇదంతా చూచి సముద్రం నవ్వుతున్నట్లుగా కదలాడాయి అలలు! ★

## జామకాయలతో జెల్లీ లేక హల్వా

**కావలసిన వస్తువులు :**

జామపళ్ళు-6 (రసము ½ litre) (పచ్చివికాక మరీ పండువికాక దోరగా వుండేవి) పంచదార ½kg (రసము ఎంతో అంత పంచదార) నిమ్మ ఉప్పు-½ టీ చెంచా.

**చెయు విధానము :**

జామపళ్ళు కడిగి ముచికలు తీసివేసి చక్రాలుగా తరిగి వుంచుకోవాలి. ఒక స్టీలు గిన్నెలో ఈ ముక్కలను వేసి ముక్కలు మునిగే నీళ్ళు పోయాలి. అరగంట సన్న సెగని ఉడికించాలి. వేరొక స్టీలు పాత్రకు పల్చని బట్ట వేసి గట్టిదారంతో ముడి వేసి వుంచుకోవాలి. ఆ బట్టలో ఈ పదార్థము పోసిన గిన్నెలోకి ఆ రసము దిగుతుంది. ఆ రసాన్ని ఒక గ్లాసుతో కొలిచి ఎన్ని గ్లాసుల రసం వుంటే అన్ని గ్లాసుల పంచాదార పోసి స్టౌ మీద పెట్టాలి. బాగా ముద్దగా వచ్చాక నిమ్మఉప్పు వేసి కలియబెట్టాలి. మనం ఈ పదార్థమును ఒక చెంచాతో తీసి పళ్ళెములోవేస్తే అలాగే వుండిపోవాలి - అప్పుడు సరిగా తయారైనట్లు తెలుస్తుంది. దీనిని దింపి బాగా చల్లారిన పిదప హార్లిక్సు సీసాలో వేసి వుంచుకుంటే. కొన్నాళ్ళు నిలవ వుంటుంది. బ్రెడ్‌లోకి, పూరీ, చపాతీలలోకి నంజుకుంటే చాలా రుచిగా వుంటుంది. వంటికి మంచిది. విటమిన్లు కలిగిన ఆహారం.

—ఎ. అరుంధతీరావు